దంతెవాడలో దాస్యం పర్యటన

కమల్ చంద్రభంజ్ దేవ్ ఆహ్వానం మేరకు ఉత్సవాలకు హాజరు

దంతేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

మహారాజా కమల్‌చంద్రతో కలిసి ఫాగున్ మడాయి ఉత్సవాల్లో పాల్గొన్న దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ, మార్చి 12 : ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ పర్యటించారు. ప్రస్తుత కాకతీయ వారసుడు మహారాజా కమల్ చంద్ర భంజ్ దేవ్ కాకతీయ ఆహ్వానం మేరకు దంతెవాడ కేంద్రంగా జరిగే ప్రసిద్ధ ఫాగున్ మడాయి ఉత్సవాల్లో బుధవారం వినయ్ భాస్కర్ పాల్గొన్నారు. వరంగల్ నుంచి వెళ్లి బస్తర్‌లో మలి కాకతీయ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసిన అనంతరం అక్కడి కాకతీయ పాలకులు నిర్మాణం చేసిన ఆలయాలను మహారాజ కమల్ చంద్రతో కలిసి సందర్శించారు. ముందుగా మహారాజా బస్తర్‌తో కలిసి దంతెవాడలోని శక్తిపీఠమైన శ్రీ దంతేశ్వరి అమ్మవారి ఆలయంలో దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మికంగా, సాంస్కృతికంగా ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఆలయాలను దర్శించుకోవడం, స్థానిక ప్రజల ఆదివాసీ సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రముఖ వేడుకలలో ఒకటని దాస్యం పేర్కొన్నారు. అనంతరం బర్సూర్ ప్రాంతంలోని నాగవంశీ రాజుల కాలం నాటి గొప్ప వారసత్వ సంపద ఉన్న అనేక పురాతన ఆలయాలను సందర్శించారు. ఈ ప్రాంతం ముఖ్యంగా మామా-భాంజా ఆలయంలో ఉన్న పురాతన తెలుగు శాసనాన్ని పరిశీలించారు. ఇది ఈ ప్రాంతానికి తెలుగువారితో ఉన్న సంబంధాన్ని చాటిచెబుతోందని కమల్ చంద్ర భంజ్ దేవ్ అభిప్రాయపడ్డారు. అలాగే వరంగల్ చరిత్రకు ముడిపడి ఉన్న పెద్దమ్మ గుడిని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటువంటి ప్రదేశాలు మన సంస్కృతి గొప్పతనాన్ని చాటిచెబుతాయని దాస్యం అన్నారు. భవిష్యత్ తరాలకు మన పూర్వీకుల వారసత్వాన్ని అందించాలంటే మనం వీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో టార్చ్ సంస్థ కార్యదర్శి అరవింద్ ఆర్య పాల్గొన్నారు.

కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో బోల్తా

నడికూడ, మార్చి 12 : ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో బోల్తాపడిన ఘటన బుధవారం జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపురం మండలం గూడూరు గ్రామానికి చెందిన మహిళలు నడికూడ, మలక్‌పేట గ్రామానికి కూలి పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా నడికూడ పెట్రోల్ పంపు వద్ద ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని ట్రాలీ ఆటో డ్రైవర్ తప్పించబోగా, అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టి బోల్తాపడింది. బైక్ నడుపుతున్న రావుల కొమురమల్లు తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాలీలో ప్రయాణిస్తున్న ఐదు గురికి తీవ్రంగా, పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 సహాయంతో కమలాపూర్ ప్రభుత్వ ఆస్పతికి, అలాగే తీవ్ర గాయాలైన ఐదుగురిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

నిర్దేశిత పనులను త్వరగా పూర్తి చేయాలి

హనుమకొండ, మార్చి 12 : సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో నిర్దేశిత పనులను త్వరగా పూర్తి చేయాలని ఎన్పీడీసీఎల్ ఆపరేషన్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ గౌడ మధుసూదన్ ఆదేశించారు. బుధవారం నిట్ సబ్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న 8.0ఎంవీఏ పవర్‌ట్రాన్స్‌ఫార్మర్, 11కేవీ బ్రేకర్ ఏర్పాటు పనులను తనిఖీ చేశారు. సుబేదారి సెక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 160 ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. కార్యక్రమంలో హనుమకొండ డీఈ సాంబారెడ్డి, కాజీపేట ఏడీఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏడీఈ మల్లికార్జున్ పాల్గొన్నారు.

స్వీరోస్ అన్ని రంగాల్లో రాణించాలి

హనుమకొండ చౌరస్తా, మార్చి 12 : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని స్వీరోస్ అన్ని రంగాల్లో రాణించాలని స్వీరోస్ రాష్ట్ర కన్వీనర్ చాతళ్ల సదానందం పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భీమ్ దీక్ష వాల్‌పోస్టర్లను స్వీరోస్ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ.. జ్ఞానం కోసమే భీమ్ దీక్ష అని, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి బౌద్ధ స్తూపం వద్ద మార్చి 15 నుంచి ఏప్రిల్ 14 వరకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో స్వీరోస్ రాష్ట్ర కో-కన్వీనర్ పుల్లా కిషన్, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు సుభద్ర, శ్యామల, మనోజ్ పాల్గొన్నారు.

గురుకులాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

- అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి
- కలెక్టర్ ప్రావీణ్య

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, మార్చి 12 : గురుకులాల్లో నాణ్యమైన భోజనం, పరిశుభ్రత, టాయిలెట్ల నిర్వహణ బాగుండేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలు, కస్తూర్బా విద్యాలయాల్లో ఫుడ్ సేఫ్టీ, వసతుల కల్పనపై అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం 110 గురుకులాలు ఉన్నాయని, భోజనం, ఇతర వసతులను జిల్లా అధికారులు పర్యవేక్షిస్తున్నారని డీఆర్వో గణేశ్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గురుకులాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులకు భోజనం మెనూ ప్రకారం అందించాలని, బియ్యం, పాలు, కూరగాయలు, ఇతర సరుకులు నాణ్యతగా ఉండాలన్నారు. మైనర్ రిపేర్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా గురుకులాలకు నీటి సరఫరా జరగాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఈవో వాసంతి, డీసీఎస్‌వో కొమురయ్య, పౌరసరఫరాల కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, జిల్లా సంక్షేమాధికారి జయంతి, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి శ్రీలత పాల్గొన్నారు.

ఇనుపరాతి గుట్ట భూములపై సమీక్ష..

ధర్మసాగర్ మండలంలోని ముప్పారం, దేవునూరు గ్రామాల్లో విస్తరించిన ఇనుపరాతి గుట్ట పరిధిలో ఫారెస్ట్ అధికారులు గుర్తించిన వ్యవసాయ పట్టా భూములపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశానికి ఆర్డీవో రాథోడ్ రమేశ్, ల్యాండ్ సర్వే విభాగం ఏడీ శ్రీనివాసులు, ధర్మసాగర్ తహసీల్దార్ గుత్తికొండ సదానందం హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో లేని భూములను గుర్తించి తిరిగి రైతులకు అందజేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. పట్టా పాస్ పుస్తకాలు కలిగిన రైతులకు చెందిన 45 ఎకరాల వ్యవసాయ భూమిని వారి ఆధీనంలోనే ఉండే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో కూడా పీవో అజిత్‌రెడ్డి, వేలేరు తహసీల్దార్ కోమి పాల్గొన్నారు.

నేడు మడికొండ సబ్ స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల సదస్సు

హనుమకొండ, మార్చి 12 : నేడు మడికొండ సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేసినట్లు టీజీఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల చైర్‌పర్సన్ వేణుపాలచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జడ్పీ కారుణ్య నియామకాల కౌన్సెలింగ్ పూర్తి

హనుమకొండ, మార్చి 11 : జడ్పీలో కారుణ్య నియామకాల కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం పూర్తయింది. జిల్లా రెవెన్యూ అధికారి గణేశ్, జడ్పీ సీఈవో విద్యాలత కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 48 మంది అభ్యర్థులకు 38 మంది కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు సీఈవో తెలిపారు. మిగిలిన 11 మందికి డీఆర్‌వో, సీఈవో కలిసి పోస్టింగ్ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టింగ్ ఆర్డర్లను సీల్డ్ కవర్‌లో భద్రపరిచినట్లు జడ్పీ అధికారులు తెలిపారు. సూపరింటెండెంట్ రాంబాబు, సెక్షన్ అసిస్టెంట్ గోపాల్‌సింగ్, నవీన్, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫాతిమామాత ప్రతిమ ఊరేగింపులో పాల్గొన్న ఉడుమల బాల, క్రైస్తవులు

ఘనంగా ఫాతిమా మాత ప్రతిమ ఊరేగింపు

న్యూశాయంపేట, మార్చి 12 : కాజీపేట పట్టణం ఫాతిమానగర్‌లోని సెయింట్ జోసెఫ్ కెథడ్రల్ చర్చిలో ఫాతిమా మాత ఉత్సవాలు బుధవారం రెండో రోజూ కొనసాగాయి. ఉత్సవాలకు పలు జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఫాతిమా ప్రతిమతో మహారథ ప్రదక్షిణ పురవీధుల్లో సాగింది. వరంగల్ మేత్రాసన పీఠాధిపతి, బిషప్ ఉడుమల బాల ఫాతిమా మాత ప్రతిమకు ప్రత్యేక ప్రార్థనలు చేసి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం పునీత ఆంథోని కళాపైదికపై సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. సీఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఏసీపీ సత్యనారాయణ, సీఐ ట్రాఫిక్‌ను నియంత్రించారు.

కాకతీయ కెనాల్‌లో మృతదేహం

నయీంనగర్, మార్చి 12 : కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకతీయ కెనాల్‌లో స్థానికులు మృతదేహాన్ని గుర్తించారు. స్థానికుల సమాచారంతో బుధవారం ఉదయం గుండ్ల సింగారం ప్రాంతంలో కెనాల్‌లో కొట్టుకుపోతున్న మృతదేహాన్ని బయటికి తీసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయసు 30-35 సంవత్సరాల మధ్య ఉంటుందని, నలుపు రంగు టీషర్ట్, బ్లూ కలర్ లోయర్, మెడలో వెండి చైన్‌ను ధరించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712685115, 8712685088 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు కోరారు.

కేక్ కట్ చేసి తినిపిస్తున్న సత్యం కంప్యూటర్స్ ఫౌండర్ గంటా రవికుమార్

విద్యార్థుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా బోధన

వరంగల్, మార్చి 12 : విద్యార్థులు, తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యా బోధన చేస్తున్నామని సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఫౌండర్ గంటా రవికుమార్ అన్నారు. బుధవారం సత్యం కన్వెన్షన్ హాల్‌లో జరిగిన సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ 24వ వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఆదరణతోనే తెలంగాణ వ్యాప్తంగా అనేక బ్రాంచ్‌లు ఏర్పాటు చేశామని, అనతి కాలంలోనే 6 రాష్ట్రాల్లో సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్లు స్థాపించామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ముందుకు సాగుతున్నామన్నారు. తమ విద్యార్థులు పలు సంస్థల్లో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డారని చెప్పారు. విద్యార్థులు ఇచ్చిన ధైర్యంతోనే గోల్డెన్ ఓక్ స్కూల్‌ను ప్రారంభించి నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు కందుకూరి విజయకుమార్, కలువల శ్రీనివాస్, సెంటర్ కో ఆర్డినేటర్లు పోశాల సతీశ్, ఎర్ర ప్రకాశ్, మామిడి రంజిత్, వడ్లకొండ రాజ్‌నారాయణ, నేరెళ్ల క్రాంతి, తౌటం శ్రవణ్ పాల్గొన్నారు.

నిట్‌లో 'ఇండస్ట్రీ-అకాడమియా ఇన్నోవేషన్ కాన్క్లేవ్'

నిట్‌లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మోహన్ రెడ్డి, డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ చౌరస్తా, మార్చి 12 : నిట్‌లో ఇండస్ట్రీ-అకాడమియా ఇన్నోవేషన్ కాన్క్లేవ్ నిర్వహించారు. సైయెంట్ వ్యవస్థాపకుడు బీవీఆర్ మోహన్‌రెడ్డితో పాటు దేశంలోని 47 సంస్థలకు చెందిన 80 మంది పరిశ్రమ నిపుణులు హాజరయ్యారు. ప్రారంభ సమావేశంలో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి సమాజ సమస్యల పరిష్కారానికి ఈ సంస్థ కట్టుబడి ఉందన్నారు. బీవీఆర్ మోహన్‌రెడ్డి పరిశ్రమ-విద్యా సంస్థల సహకారం ఎంత ముఖ్యమో చెప్పారు కంప్యూటర్లు, కమ్యూనికేషన్, సెన్సార్స్ అండ్ డేటా, కృత్రిమ మేధస్సు (ఏఐ)పై వివరించారు. ఎన్ఐటీ పరిశోధన, అభివృద్ధి ప్రొఫెసర్ శిరీష్ సోనవానే, డీన్ (ఆర్‌అండ్‌డీ) పరిశ్రమలతో సహకారం లక్ష్యంగా కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టుల గురించి వివరించారు.

యువకుడి ప్రాణాలపైకి తెచ్చిన ట్రాక్టర్ వివాదం

సెల్ఫీ వీడియో చిత్రీకరిస్తూ పురుగుల మందు తాగిన శోభన్‌కుమార్

పురుగుల మందు తాగుతున్న శోభన్‌కుమార్

ఐనవోలు, మార్చి 12 : ఎయిర్ కంప్రెసర్ ట్రాక్టర్ వివాదం ఓ యువకుడి ప్రాణాలపైకి వచ్చింది. ఎస్సై శ్రీనివాస్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కక్కిరాలపల్లి వడ్డెరగూడేనికి చెందిన రాపోలు శోభన్‌కుమార్ అదే గ్రామానికి చెందిన బోసు సాంబరాజు వద్ద 6 నెలల క్రితం ఫైనాన్స్ ఉన్న ట్రాక్టర్‌ను రూ.70 వేలు చెల్లించి కొనుగోలు చేశాడు. రూ.12 వేల చొప్పున 4 నెలల వాయిదాలు (ఈఎంఐ) ఫైనాన్స్ కంపెనీకి చెల్లించాడు. కాగా, సాంబరాజు బుధవారం శోభన్‌కుమార్ ఇంటికి వెళ్లి కంప్రెసర్ ట్రాక్టర్‌ను అమ్మలేదా? అని దూషిస్తూ ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. దీంతో మనస్తాపం చెందిన శోభన్‌కుమార్ పురుగుల మందు తెచ్చుకొని వడ్డెర గూడెం బండ మీద ఎవరూ లేని ప్రాంతానికి వెళ్లి తాను సాంబరాజు వల్ల పురుగుల మందు తాగుతున్నానని సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. వీడియో చూసిన కుటుంబసభ్యులు శోభన్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎంజీఎం దవాఖానలో చేర్పించారు. శోభన్‌కుమార్‌కు అన్న కుమార్, తల్లి ఎల్లమ్మ ఉన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి మానసిక స్థితే వ్యాధులకు కారణం

హనుమకొండ చౌరస్తా, మార్చి 12 : ఒక వ్యక్తి రోగనిరోధక వ్యవస్థను అతని మానసిక స్థితి ప్రభావితం చేయగలదని కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం అన్నారు. కాకతీయ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగంలో రెండురోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైకాలజీ అండ్ ఇమ్యునాలజీ కలిసి పనిచేస్తే మానసికంగా ధైర్యంగా ఉండే వ్యక్తుల్లో వ్యాధులను ఎదుర్కొనే శక్తి పెరుగుతుందని మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. సదస్సు నిర్వాహకుడు వెంకయ్య మాట్లాడుతూ.. సదస్సులో వివిధ యూనివర్సిటీల పరిశోధకులు పరిశోధనా పత్రాలు సమర్పించారన్నారు. యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ మనోహర్, మాజీ ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్, యూజీసీ కో-ఆర్డినేటర్ మల్లికార్జున్‌రెడ్డి, చైర్మన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఈసం నారాయణ, సెమినార్ డైరెక్టర్ షమిత, జంతుశాస్త్ర ఆచార్యులు మామిడాల ఇస్తారి పాల్గొన్నారు.

12పీకెఎల్03సి- మాట్లాడుతున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి మనన్‌భట్

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

దామెర, మార్చి 12 : మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామంలో బుధవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రూ.17,600 విలువైన అక్రమ మద్యం, సరైన పత్రాలు లేని 15 ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐపీఎస్ అధికారి మనన్‌భట్ మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. పరకాల ఏసీపీ సతీశ్‌బాబు, సీఐలు రంజిత్‌రావు, క్రాంతికుమార్, సంతోష్, ఎస్సైలు కొంక అశోక్, పరమేశ్వర్, శివకృష్ణ పాల్గొన్నారు.

డీఆర్‌సీ సెంటర్ సామర్థ్యం పెంచాలి

గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

బాలసముద్రంలోని డీఆర్‌సీ సెంటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, మార్చి 12 : బాలసముద్రంలోని డీఆర్‌సీ కేంద్రం సామర్థ్యం పెంచాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డీఆర్‌సీ సెంటర్‌లో వర్మీ కంపోస్ట్, కోకోపిట్ యూనిట్లను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సెంటర్‌కు ప్రతి రోజూ టన్ను పొడి చెత్త చేరేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో రాజారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్, సంపత్‌రెడ్డి, వాప్ ప్రతినిధి పవన్ పాల్గొన్నారు.

గ్రూప్ -1లో రీవాల్యుయేషన్ అవకాశం కల్పించాలి

హనుమకొండ, మార్చి 12 : గ్రూప్ -1 మెయిన్స్ ఫలితాల్లో రీకౌంటింగ్‌తో పాటు రీవాల్యుయేషన్‌కూ అవకాశం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశంకు లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ తిరుణహరి శేషు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ వాల్యుయేషన్ జరిగిందని, తెలుగు మీడియంలో పరీక్ష రాసిన వారికి మార్కులు తక్కువగా వచ్చాయని ఆరోపణలు వస్తున్నాయన్నారు. రీకౌంటింగ్‌తో పాటు రీవాల్యుయేషన్‌కూ అవకాశం కల్పించాలని కోరినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణ

హనుమకొండ చౌరస్తా, మార్చి 12 : హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ శిక్షణా సంస్థ ద్వారా బీసీ విద్యార్థులకు నెల పాటు నాన్ రెసిడెన్షియల్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎంపీవీ ప్రసాద్ తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ప్రైవేటు బ్యాంకుల్లో ప్లేస్‌మెంట్ కల్పిస్తారని తెలిపారు. డిగ్రీ పూర్తయి 26 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు దరఖాస్తులను www.tgbcstudycircle.cgg.gov.inలో చేసుకోవాలన్నారు. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతంలో 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల్లోపు ఉండాలన్నారు. అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుందని, మార్కుల ఆధారంగా 30 మందిని ఎంపిక చేస్తారని తెలిపారు. మరింత సమాచారం కోసం 040-29303130 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

'విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి'

హనుమకొండ చౌరస్తా/హనుమకొండ, మార్చి 12 : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ యూనివర్సిటీ ప్రెసిడెంట్ మెరుగు సాయికుమార్ డిమాండ్ చేశారు. కేయూలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తామని, అధిక నిధులు కేటాయించి విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తామని అనేక హామీలిచ్చి గత బడ్జెట్‌లో కాంగ్రెస్ సర్కారు కేవలం 7 శాతం నిధులే కేటాయించిందని మండిపడ్డారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పూజ, సంయుక్త, సాయిప్రియ, అభినయ్ పాల్గొన్నారు. అలాగే దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో నాయకులు హనుమకొండ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అక్కడి నుంచి వరంగల్ జిల్లా కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించి కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. తిరిగి హనుమకొండ కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర కొనసాగించి కార్యాలయ ఏవోకు డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ వినతిపత్రాలు సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, జిల్లా కార్యదర్శి నరేశ్ పాల్గొన్నారు.

'రౌండ్‌టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి'

హనుమకొండ చౌరస్తా, మార్చి 12 : యూజీసీ నూతన ముసాయిదా, డిటెన్షన్ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 15న కేయూలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేశ్ అన్నారు. ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో కేయూలో సమావేశం నిర్వహించారు. డిటెన్షన్ విధానం బడుగు, బలహీన వర్గాలకు విద్యను దూరం చేసే విధంగా ఉన్నాయన్నారు. పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారి పవన్, సభ్యుడు రాజేశ్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

హనుమకొండ చౌరస్తా, మార్చి 12 : గ్లోబల్ హోప్ చాలెంజ్ సేవలు అభినందనీయమని జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి అన్నారు. కలెక్టరేట్‌లో 20 మంది దివ్యాంగులు, వితంతువులు, అనాథలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను దేవుని సంఘం జనరల్ పాస్టర్ కిమ్ జ్యో చ్యోల్‌తో కలిసి ఆమె పంపిణీ చేశారు. జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ కల్యాణి పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన విద్యుత్ సేవలు అందిస్తాం

భీమదేవరపల్లి, మార్చి 12 : రైతులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యమని హనుమకొండ రూరల్ డివిజనల్ ఇంజినీర్ సామ్యా నాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని కొత్తకొండ సెక్షన్‌లోని ముత్తారం గ్రామంలో పొలంబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ కాకుండా ఎర్తింగ్ సరిగ్గా ఉండేటట్లు సిబ్బంది పనులు చేస్తున్నారని వివరించారు. ఆటోస్టార్టర్లు తొలగించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు విస్తృత ప్రచారం చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో భీమదేవరపల్లి ఏడీఈ రాజేశ్వరరావు, ఏఈ శిరీష్ కుమార్, సబ్ ఇంజినీర్ సుదర్శన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు సంపత్, దాసు పాల్గొన్నారు.

బొగ్గు వ్యాగన్‌లో పొగలు

మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది

కమలాపూర్, మార్చి 12 : మండలంలోని ఉప్పల్ రైల్వేస్టేషన్‌లో గూడ్స్ రైలు బొగ్గు వ్యాగన్‌లో నిప్పంటుకుని పొగలు వచ్చాయి. బెల్లంపల్లి నుంచి కాజీపేట వైపు వెళ్తున్న బొగ్గు వ్యాగన్‌లో పొగలు వస్తుండడాన్ని గమనించిన రైల్వే అధికారులు ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. హుజూరాబాద్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వారు అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు.

కరెంట్ షాక్‌తో కౌలు రైతు మృతి

కుమారస్వామి(ఫైల్)

కమలాపూర్, మార్చి 12 : మండల కేంద్రానికి చెందిన కౌలు రైతు ముప్పు కుమారస్వామి (50) బుధవారం కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమారస్వామి అదే గ్రామానికి చెందిన పల్లె కొమురయ్యకు చెందిన వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఉదయం వ్యవసాయ పనుల కోసం బావి వద్దకు వెళ్లిన కుమారస్వామి తిరిగి ఇంటికి రాకపోయే సరికి అక్కడికి వెళ్లి చూడగా స్టార్టర్ వద్ద చనిపోయి ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కుమారస్వామి వెల్లడించారు.

ఆభరణాల చోరీ

నయీంనగర్, మార్చి 12 : కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో బంగారం చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కోమటిపల్లి రోడ్డులోని భద్రకాళీ నగర్ రోడ్డు నంబర్-1లో నివాసం ఉంటున్న దంపతులు ధర్మయ్య, స్రవంతి వాళ్ల బంధువు